ధర్మారెడ్డిపల్లి కాల్వకు ఫీడర్ చానల్ ఏర్పాటు చేయాలి

కాల్వలోకి దిగి నిరసన తెలుపుతున్న మత్స్య కార్మికులు

రామన్నపేట, సెప్టెంబర్ 3 : ధర్మారెడ్డిపల్లి కాల్వకు ఫీడర్ చానల్ ఏర్పాటు చేసి రామన్నపేట పెద్ద చెరువును నింపాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కందుల హన్మంతు, కార్యదర్శి పిట్టల మత్స్యగిరి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ధర్మారెడ్డిపల్లి కాల్వ వద్ద ఫీడర్ చానల్ ఏర్పాటు చేయాలని మంగళవారం కాల్వలోకి దిగి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామన్నపేట మీదుగా కొమ్మాయిగూడెం దిగువ ప్రాంతమైన చిట్యాల, ఇతర మండలాలకు నీళ్లు తరలించడం వల్ల రామన్నపేట ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఫీడర్ చానల్ ఏర్పాటు చేసి చెరువు, కుంటలను నింపి రైతాంగానికి, మత్స్యకారులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు పెద్దబోయిన మీనమ్మ, నాయకులు బచ్చ రాములు, లింగస్వామి, జింకల చిన్నరాములు, భాగ్యమ్మ, అనసూయ, నర్సమ్మ, ఇందిర, రాములమ్మ, లలిత పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించాలని రైతుల నిరసన

వాగులో నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఆలేరు రూరల్, సెప్టెంబర్ 3 : మండలంలోని కొలనుపాక – పటేల్‌గూడెం మార్గంలో ముత్యాలమ్మ గుడి దగ్గర వాగుపై బ్రిడ్జి నిర్మించాలని రైతులు మంగళవారం వాగులో నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గతంలో రైతులమంతా డబ్బులు జమ చేసుకొని వాగులో పైపులు ఏర్పాటు చేసి రాకపోకలకు రోడ్డు నిర్మించుకున్నామన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి అవి పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు ఇబ్బంది అవుతుందని తెలిపారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్పందించి బ్రిడ్జి నిర్మించాలని కోరారు. రైతులు రమేశ్, సోమిరెడ్డి, రఘుపతిరెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలకు సహకరించాలి : మున్సిపల్ చైర్మన్ రాజు

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, సెప్టెంబర్ 3 : పట్టణంలో గణేశ్ ఉత్సవాలను పండుగ వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆదేశాలతో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ మీటింగ్ అండ్ గణేశ్ ఫెస్టివల్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వినాయక విగ్రహాల నిమజ్జనం అందరూ ఒకే రోజు చేయాలని, దీంతో శాంతిభద్రతలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుందని అన్నారు. సమావేశంలో సీఐ మన్మథకుమార్, తాసీల్దార్ ఎస్.హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్‌నాయక్, ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్, ఎస్ఐ లక్ష్మయ్య పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి

ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేస్తున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి

మోత్కూరు, సెప్టెంబర్ 3 : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిని అమలు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 11, 12జీఓలను సవరించి బీఈడీ అర్హత కలిగిన ఉపాధ్యాయులకు పీఎస్ హెచ్ఎం పదోన్నతులు కల్పించాలన్నారు. 50శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎయిడెడ్, మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా జీతాలు అందించాలన్నారు. సర్వశిక్ష అభియాన్, కేజీబీవీలలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారపు వెంకటయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాజిడి రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె వెంకటేశ్వర్లు, పసునూరి సుధాకర్, నాయకులు రామకృష్ణ, రాంప్రసాద్, రాంరెడ్డి, జయశ్రీ పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం రైతుల తిప్పలు

ఆత్మకూరు(ఎం) రైతు వేదిక వద్దకు తరలివచ్చిన రైతులు

ఆత్మకూరు(ఎం), సెప్టెంబర్ 3 : రూ.2లక్షల పంట రుణాల మాఫీ కోసం రేషన్ కార్డు లేని రైతులు వ్యవసాయ అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగలేక ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్దకు గ్రామాల నుంచి, హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అధికారులకు దరఖాస్తులు అందజేసి ఫొటోలు దిగేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రుణమాఫీపై వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నాడు అందరికీ రుణమాఫీ అన్నారు..

నేడు షరతులతో ఇబ్బందులు పెడుతున్నారు

- బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు యాదిరెడ్డి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత యాదిరెడ్డి

ఆత్మకూరు(ఎం), సెప్టెంబర్ 3 : ఎన్నికల ముందు ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2లక్షల్లోపు పంట రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చాక షరతులు విధిస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం) మండలంలోని కచ్చకాయకుంట్ల బావికి చెందిన రైతు, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కచ్చకాయకుంట్ల యాదిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్దకు రుణమాఫీ కోసం దరఖాస్తులు అందజేయడానికి వచ్చిన ఆయన.. రైతులు పడుతున్న ఇబ్బందులను గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు షరతులు లేకుండా రుణమాఫీ అని చెప్పి నేడు రేషన్ కార్డు లేకుంటే మాఫీ చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. దీన్ని రైతులందరూ వ్యతిరేకిస్తుండడంతో రేషన్ కార్డు లేని రైతులకు కూడా రుణమాఫీ చేస్తామని ప్రకటించడం నమ్మకంగా లేదని పేర్కొన్నారు. కాలయాపన కోసమే రేషన్ కార్డు లేని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని ఆరోపించారు. రుణమాఫీ కోసం అర్హులైన రైతుల జాబితా బ్యాంకు అధికారుల వద్ద ఉన్నప్పటికీ దరఖాస్తులు చేసుకోవాలనడం రైతులను మోసం చేయడమేనన్నారు. ఆగస్టు 15లోపు రైతులందరికీ రుణమాఫీ చేస్తానని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పటి వరకు సగం మందికి కూడా చేయలేదని తెలిపారు. రైతుభరోసా పేరుతో ఎకరానికి రూ.15వేలు ఇస్తామని ప్రకటించి.. 15పైసలు కూడా ఇవ్వకుండా మోసం చేస్తున్న ఘనత రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ఇప్పటికైనా ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయకుంటే కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా నష్టపోతుందని హెచ్చరించారు.

వైభవంగా వెండి మొక్కు జోడు సేవోత్సవం

స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 3 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారికి వెండి మొక్కుజోడు సేవోత్సవం అత్యంత వైభవంగా సాగింది. మంగళవారం సాయంత్రం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించారు. స్వామివారిని గరుడ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై వేంచేపు చేసి ప్రాకార మండపంలో ఊరేగించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. స్వామివారికి కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. ప్రధానాలయం మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతును జరిపారు. సాయంత్రం స్వామివారికి దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి ప్రధానాలయం ముఖ మండపంలో ప్రతిష్ఠామూర్తులకు తిరువారాధన, సహస్రనామార్చన జరిగాయి. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. క్షేత్రపాలకుడైన ఆంజనేయ స్వామికి ఆకు పూజ ఘనంగా జరిగింది. వెయ్యి తమలపాకులతో సహస్రనామార్చన జరిపి, వడపప్పు, బెల్లం నైవేద్యంగా సమర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 8వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.21,09,091 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

జైహింద్ కాలేజీలో అడ్మిషన్లు తీసుకోవద్దు

- జిల్లా నోడల్ అధికారి రమణి

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 3 : జిల్లా కేంద్రంలోని జైహింద్ జూనియర్ కళాశాలకు ప్రభుత్వ అనుమతులు లేవని, విద్యార్థులు అడ్మిషన్ పొందవద్దని జిల్లా నోడల్ అధికారి రమణి తెలిపారు. పట్టణంలోని జగదేవపూర్ రోడ్డులో నిర్వహిస్తున్న జైహింద్ జూనియర్ కళాశాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. కళాశాలలో రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో 45 మంది, సెకండియర్‌లో 15 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారని గుర్తించినట్లు తెలిపారు. వివరాలను ఇంటర్మీడియట్ బోర్డుకు నివేదించామని, త్వరలో కళాశాలపై తగు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ప్రభుత్వ కళాశాలకు బీసీ బాలుర హాస్టల్ మంజూరు

మోత్కూరు, సెప్టెంబర్ 3 : మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రభుత్వం బీసీ బాలుర హాస్టల్ మంజూరు చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బి.బాలమయాదేవి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణంలోని బీసీ బాలుర సంక్షేమ వసతి గృహంలోని మొదటి అంతస్తులో కళాశాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వసతి గృహం మంజూరు చేయడంతో మోత్కూరు, గుండాల, ఆత్మకూరు(ఎం), అడ్డగూడూరు మండలాల పేద విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుంది. హాస్టల్ మంజూరుపై మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కళాశాల ప్రిన్సిపాల్ జి.ప్రభ జస్టిస్, ఆధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

దుకాణాల అద్దెకు బహిరంగ వేలం

చౌటుప్పల్, సెప్టెంబర్ 3 : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ముందు భాగంలో కొత్తగా నిర్మించిన 12 వాణిజ్య దుకాణాలను ఏడాది పాటు అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సంబంధిత కార్యదర్శి వి.రవీందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లా వాసుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు వెయ్యి రూపాయలు చెల్లించి టెండర్ షెడ్యూల్ పొందాలని సూచించారు. 5 జనరల్ కేటగిరి, 4 బీసీ, 2ఎస్సీ, ఒకటి ఎస్టీకి కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ నెల 3నుంచి 9వరకు షెడ్యూల్ అమ్మకాలు చేపడుతామని పేర్కొన్నారు. టెండర్ ఫారంతోపాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి పేరున రూ.20వేలు ఈఎండీ డీడీ తీయాలని సూచించారు. షాపుల కేటాయింపులో నియమ నిబంధనలు, షరతులు, ఇతర వివరాలకు కార్యాలయ పనివేళలో 7330733596లో సంప్రదించాలని కోరారు.

'ఆదివాసి బిడ్డలపై దాడులను అరికట్టాలి'

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబర్ 3 : ఆదివాసి, ఎరుకల కులస్తులపై జరిగే దాడులను అరికట్టాలని ఆదివాసి, ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు కుతాడి సురేశ్ అన్నారు. మండలంలోని కుంట్లగూడెం గ్రామానికి చెందిన ఎరుకల కులస్తులైన బుడ్డ అజయ్, బుడ్డ శివపై అదే గ్రామానికి చెందిన గంగాదేవి చంద్రయ్య, నవీన్ మంగళవారం కత్తులతో దాడి చేసి గాయపరిచారన్నారు. నిందితులను అరెస్టు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన వెంట ఎరుకల సంఘం జిల్లా కార్యదర్శి కుతాడి యాదగిరి, నాయకులు శ్రీరామ్, రవికుమార్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

రామన్నపేట : ఎమ్మెల్యే వీరేశం చొరవతో మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన నకిరేకంటి మహేశ్, గుర్రం నరేశ్, ఎస్.భిక్షం, నన్నూరి భిక్షంరెడ్డికి సీఎంఆర్ఎఫ్ నుంచి నిధులు మంజూరయ్యాయి. ఆ చెక్కులను మాజీ ఎంపీటీసీ మహేందర్‌రెడ్డి బాధితులకు అందజేశారు. మాజీ సర్పంచ్ నర్సింహ, నాయకులు శేఖర్‌గౌడ్, పెద్దులు, రవీందర్, రమేశ్, మధు, వెంకటేశం, మల్లేశం, సైదులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ అమలులో ప్రభుత్వం విఫలం

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

చౌటుప్పల్, సెప్టెంబర్ 3 : రైతుల పంట రుణమాఫీ అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. ప్రస్తుతం సర్వేల పేరుతో ప్రభుత్వ యంత్రాంగం కాలయాపన చేస్తుందని, దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ట్రిబుల్ ఆర్ బాధితులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి గంగదేవి సైదులు, నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, గడ్డం వెంకటేశం, రాగీరు కిష్టయ్య, తడక మోహన్, సంజీవరెడ్డి, మధుకృష్ణ, శ్రీశైలం, సుదర్శన్, యాదయ్య పాల్గొన్నారు.

'విద్యుత్ సౌధ ముట్టడిని విజయవంతం చేయాలి'

పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతున్న బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మురళి

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 3 : విద్యుత్ బీసీ, ఓసీ ఐక్యకార్యాచరణ సమితి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే విద్యుత్ సౌధ ముట్టడిలో విద్యుత్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి మురళి అన్నారు. పట్టణంలోని డివిజన్ కార్యాలయం ఆవరణలో మంగళవారం విద్యుత్ సౌధ ముట్టడి పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యుత్ సంస్థలో ఓసీ, బీసీలకు పదోన్నతులు కల్పించాలన్నారు. అన్ని కేడర్లలో నియమించబడుతున్న ఉద్యోగులను సీనియారిటీ, మెరిట్ ఆధారంగా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ కార్మికులకు ఏపీ రూల్స్ వర్తింపజేసి అర్హత ఆధారంగా పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ ఇంజినీర్ దంతూరి మల్లికార్జున్, సంఘం నాయకులు నరేశ్, బాలనర్సింహ, సిద్ధిలింగం, నర్సింహ, వెంకటేశ్, సోమమ్మ, బాలమణి, రేణుక పాల్గొన్నారు.

గోదావరి జలాల సాధన సదస్సును జయప్రదం చేయాలి

- మూసీ ప్రక్షాళన, గోదావరి, కృష్ణా జలాల సాధన వేదిక జిల్లా కన్వీనర్ బాలరాజు

వలిగొండలో సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

వలిగొండ, సెప్టెంబర్ 3 : మూసీ ప్రక్షాళన, బునాదిగాని, భీమలింగం కాల్వల ద్వారా గోదావరి జలాల సాధన కోసం మండల కేంద్రంలో ఈ నెల 6న నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని మూసీ ప్రక్షాళన, గోదావరి జలాల సాధన సమితి జిల్లా కన్వీనర్ మాటూరి బాలరాజు అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మూసీ విషపు నీటి వల్ల ఇబ్బంది పడుతున్న ప్రజలకు శాశ్వత విముక్తి కల్పించడానికి బస్వాపురం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను అందించాలన్నారు. సదస్సుకు రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు సిర్పంగి స్వామి, వాకిటి వెంకట్‌రెడ్డి, భిక్షపతి, యాదయ్య, వెంకటయ్య, రాములు, దావీద్, నాగరాజు పాల్గొన్నారు.

సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

భువనగిరి కలెక్టరేట్ : ఈ నెల 6న వలిగొండలో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని మూసీ ప్రక్షాళన, గోదావరి, కృష్ణా జలాల సాధన వేదిక జిల్లా కో కన్వీనర్ కొండ మడుగు నర్సింహ అన్నారు. మండలంలోని అనాజీపురంలో సదస్సు పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఏండ్లు గడుస్తున్నా జిల్లాలో కాల్వల నిర్మాణం, నిర్వహణ నేటికీ పూర్తిగాక అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. నాయకులు దయ్యాల నర్సింహ, మాజీ సర్పంచ్ బొల్లేపల్లి కుమార్, పాల సంఘం మాజీ చైర్మన్ ఎదునూరి మల్లేశం, నీటి సంఘం మాజీ చైర్మన్ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

'పార్ట్ టైం ఉపాధ్యాయులను కొనసాగించాలి'

ప్రిన్సిపాల్ రమకు వినతిపత్రం ఇస్తున్న పార్ట్ టైం ఉపాధ్యాయులు

అడ్డగూడూరు, సెప్టెంబర్ 3 : గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న పార్ట్ టైం ఉపాధ్యాయులను కొనసాగించాలని మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల ఎదుట మంగళవారం పార్ట్ టైం ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ రమకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను ఇప్పటికిప్పుడు అర్ధాంతరంగా తొలగించడం బాధాకరమన్నారు. గురుకుల పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి తాము కృషి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్ట్ టైం ఉద్యోగులు గిరి యాదవ్, పరిగెల కనకయ్య, నర్సింహారావు, గీత, సంధ్య, రూప, ఉపేంద్ర, అశ్విని, రాంబాబు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతి

మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం ఇస్తున్న డ్రైవర్స్ కాలనీ వాసులు

మోత్కూరు, సెప్టెంబర్ 3 : మున్సిపాలిటీలోని డ్రైవర్స్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీలోని వీధులన్నీ చెత్తాచెదారంతో నిండి అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. డ్రైనేజీ కాల్వలు లేక ఇండ్లలోని మురుగు నీరు వీధుల్లో ప్రవహిస్తుందని తెలిపారు. తాగునీటి సమస్యతో రోజూ ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని చెప్పారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పురుగుల నర్సింహ, ఎండీ సమీర్, జానీపాషా, ఖలీల్, శ్యామల, ప్రకాశ్‌రెడ్డి, సోమలింగాచారి, సురేశ్ పాల్గొన్నారు.

పోషక లోపాల నివారణకు కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ కె.గంగాధర్


పోషణ మాసం పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్ తదితరులు

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 3 : బాలింతలు, గర్భిణులు, పిల్లలకు పోషకాహారం సక్రమంగా అందించాలని, వారిలో పోషక లోపాలను నివారించేలా కృషి చేయాలని అదనపు కలెక్టర్ కె.గంగాధర్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, హెల్త్ డిపార్టుమెంట్ ఎంఎల్‌హెచ్‌పీ, వైద్య అధికారులకు పోషణ మాసం కార్యక్రమం, పర్యవేక్షణతో కూడిన ఆహార పద్ధతులపై మంగళవారం ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, ఐదు సంవత్సరాల్లోపు పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఈ నెల 1నుంచి 30వరకు జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పిల్లల బరువు, ఎత్తు నమోదు చేయడం, వయస్సుకు తగిన బరువు, ఎత్తు లేని పిల్లలకు పర్యవేక్షణతో కూడిన ఆహారాన్ని అందిస్తూ వైద్య పరీక్షలు చేయించాలని అన్నారు. తక్కువ బరువు ఉన్న పిల్లలకు ఆకలి పరీక్షలు నిర్వహించాలని, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని, డాక్టర్ సలహా మేరకు పోషకాహార పునరావాస కేంద్రాలకు పంపాలని సూచించారు. ఆకలి పరీక్షలో ఉత్తీర్ణులైన పిల్లలకు పర్యవేక్షణతో కూడిన ఆహారం ఇవ్వడం, ఉత్తీర్ణులు కాని పిల్లలకు మెడికల్ ఆఫీసర్లతో పరీక్షలు చేయించి మందులు, పోషకాహారం, బాలామృతం అందించాలని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి చిన్నారుల తల్లిదండ్రులకు సలహాలు అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార నిల్వలను సరిగా భద్రపరుచాలని, రోజూ చెక్ చేసుకోవాలని సూచించారు. చెడిపోయిన ఆహారాన్ని వెంటనే పారవేయాలని, ఆ వివరాలను యాప్‌లో నమోదు చేయాలని, పైఅధికారుల దృష్టికి తేవాలని ఆదేశించారు. పిల్లల ఆహారం విషయంలో అతి జాగ్రత్తగా ఉండాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని, తాగునీరు, వంటల నిర్వహణ సక్రమంగా ఉండాలని చెప్పారు. అనంతరం పోషణ మాసం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, డీఆర్డీఓ నాగిరెడ్డి, ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ యశోద, డాక్టర్లు మనోహర్, శిల్పిని, రామకృష్ణ, వీణ పాల్గొన్నారు.

యూడైస్ ప్లస్‌లో సమగ్ర సమాచారం నమోదు చేయాలి

- జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రీహరి అయ్యంగార్

ఉపాధ్యాయుల శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రీహరి అయ్యంగార్

బొమ్మలరామారం, సెప్టెంబర్ 3 : యూడైస్ ప్లస్ పోర్టల్‌లో పాఠశాలకు సంబంధించిన సమగ్ర సమాచారం తప్పులు లేకుండా నమోదు చేయాలని జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ శ్రీహరి అయ్యంగార్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మండలంలోని ప్రధానోపాధ్యాయులకు యూడైస్ ప్లస్‌లో సమాచారం నమోదుపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు సంబంధించిన అన్ని రకాల సమాచారం, మౌలిక వసతుల విషయాలలో పొరపాట్లకు తావులేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యూడైస్ ప్లస్ ఆధారంగానే రాబోయే రెండు సంవత్సరాలకు సంబంధించిన పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలు, నిధులు, సిబ్బంది కేటాయింపు నిర్ణయాలను ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థుల అభివృద్ధి సూచికల ఆధారంగా పాఠ్య ప్రణాళిక, బోధనా పద్ధతులను నవీకరిస్తారని చెప్పారు. ఎంఈఓ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి రోజారాణి, ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, నిర్మలాజ్యోతి, రాజు, గిరిధర్‌రెడ్డి, రమేశ్, మిస్ కో ఆర్డినేటర్ శిరీష, సీఆర్పీ శ్రీహరి, ఎల్‌డీపీ ప్రియాంక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ : డీఏఓ గోపాల్

సంస్థాన్ నారాయణపురంలో రైతుల దరఖాస్తులను పరిశీలిస్తున్న డీఏఓ గోపాల్

సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 3 : అర్హత కలిగిన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని, మాఫీ కానివారు మండల వ్యవసాయ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణమాఫీ కాని రైతుల కోసం ఏర్పాటు చేసిన దరఖాస్తుల స్వీకరణను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతుల దరఖాస్తులను పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఒక్కో రోజు ఒక్కో గ్రామంలో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. అనంతరం మండలంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ పావని, ఏఈఓలు నవీన్, అనూరాధ పాల్గొన్నారు.

దరఖాస్తులను త్వరగా పూర్తి చేస్తాం

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని తాళ్లసింగారంలో రుణమాఫీ దరఖాస్తుల అప్‌లోడ్‌ను డీఏఓ గోపాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల రుణమాఫీ దరఖాస్తులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో 18,072 దరఖాస్తులు రాగా.. 5,372 దరఖాస్తుల అప్‌లోడ్ పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ ఎం.ముత్యాలు, ఏఈఓలు శంకరయ్య, కృష్ణ, లావణ్య, రైతులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి : ఏసీపీ

సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్

ఆలేరు రూరల్, సెప్టెంబర్ 3 : గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఏసీపీ రమేశ్ అన్నారు. ఆలేరు పట్టణంలో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, దీంతో భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీస్ అధికారులకు సులువుగా ఉంటుందని తెలిపారు. మండపం ఏర్పాటు చేసే సమయంలో విద్యుత్ షాట్ సర్క్యూట్ జరుగకుండా నాణ్యమైన వైర్లను ఉపయోగించి పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ కొండల్‌రావు, తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్, ఎస్ఐ రజనీకర్, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

పూల మొక్కల పరిశీలన

దత్తప్పగూడెంలో పూల మొక్కలను పరిశీలిస్తున్న ఈజీఎస్ సామాజిక తనిఖీ బృందం

మోత్కూరు, సెప్టెంబర్ 3 : మండలంలోని దత్తప్పగూడెంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ బృందం మంగళవారం సందర్శించింది. గ్రామంలోని కమ్యూనిటీ ప్లాంటేషన్‌ను డీఆర్పీలు పి.స్వామి, వీఎస్ఏకే పల్లవి పరిశీలించారు. రెండు ఎకరాల్లో సాగు చేసిన 1,310 పూల మొక్కలను లెక్కించారు. మొక్కల పెంపకంపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట ఫీల్డ్ అసిస్టెంట్ కంచర్ల సోమిరెడ్డి ఉన్నారు.

వైద్యం కోసం ఆర్థిక సాయం

పారుపల్లిలో యాదగిరిని పరామర్శిస్తున్న మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి

రాజాపేట, సెప్టెంబర్ 3 : మండలంలోని పారుపల్లి గ్రామానికి చెందిన భూపతి యాదగిరి స్వల్ప అనారోగ్యానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాపోలు లక్ష్మారెడ్డి మంగళవారం యాదగిరిని పరామర్శించి వైద్య ఖర్చుల కోసం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా ఇటీవల మృతిచెందిన మోత్కుపల్లి ఎల్లమ్మ కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు గౌర బక్కయ్య, సీతాల వీరయ్య, నాయకులు మోటె బాలమల్లేశం, కాలె నర్సింహులు, రావుల బాలరాజు, నర్సింహులు, భాస్కర్, రాములు, ఆంజనేయులు, బాలనర్సయ్య, కపిల్, విజయ్ పాల్గొన్నారు.